రహదారులు బురదమయం

- వర్షం వస్తే నరకమే..
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బురదమయంగా పోలుకొండ రహదారి



చెరువును తలపిస్తున్న లక్ష్మీనరసింహపురం రోడ్డు



గోపాలపురం రహదారి దుస్థితి

నందివాడ: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు వర్షం వస్తే బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఈ రహదారులపై రాకపోకలు సాగించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని లక్ష్మీనరసింహపురం, పోలుకొండ, రుద్రపాక, గోపాలపురం రహదారులపై రాకపోకలు సాగించడానికి ఇక్కట్లు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే రహదారులపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోంది. రహదారులను అభివృద్ధి చేసి ఇబ్బందులు తొలగిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి నాయకులు వెంటనే వాటిని బాగు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఏడు కిలోమీటర్లు అధ్వానం..

లక్ష్మీనరసింహపురం నుంచి పోలుకొండ వరకు ఉన్న ఏడు కిలోమీటర్లు మేర ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా బురదమయంగా ఉండడంతో రాకపోకలు సాగక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా రుద్రపాక–గోపాలపురం రహదారి

రుద్రపాక నుంచి గోపాలపురం వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో రహదారి గుంతల పడి కుంగిపోయింది. రాత్రి వేళల్లో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నడిచి వెళ్లేందుకు కూడా కష్టమే..



పోలికొండ రోడ్డంతా బురదమయంగా మారింది. నడిచి వెళ్లేందుకు కూడా కష్టంగా ఉంది. రహదారి సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– రమేష్, పోలుకొండ

ప్రయాణమంటేనే భయం



రుద్రపాక నుంచి గోపాలపురం రోడ్డు బాగా దెబ్బతింది. ఈ రోడ్డుపై ప్రయాణమంటే భయంగా ఉంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి.

– శ్రీనివాస్, వాహన చోదకుడు

చవితి ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలి

డీఎస్పీ ధీరజ్ వినీల్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పోలీసుశాఖ ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో వినాయక చవితి పందిళ్లు ఏర్పాటు చేసే వారు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. కుల, మతాలకు తావు లేకుండా వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతి లేదన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఏదైనా సంఘటన జరిగితే దానికి కమిటీలదే బాధ్యత అన్నారు. సమావేశంలో వన్, టూ, రూరల్ సీఐలు కొండపల్లి శ్రీనివాస్, అనీష్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ట్రాఫిక్,రూరల్ ఎస్ఐలు నాగరాజు, ఎన్.చంటిబాబు పాల్గొన్నారు.

మచిలీపట్నం వెళ్లే వాహనాలు దారి మళ్లింపు

గుడివాడరూరల్: మచిలీపట్నం వెళ్లే వాహనాలను పెదకాల్వ సెంటర్ నుంచి దారి మళ్లించి గుడివాడ మండలం బిళ్లపాడు మీదుగా వాహనదారులు తరలించేలా చర్యలు చేపట్టామని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గుడివాడ పెదకాల్వ సెంటర్ వద్ద జరుగుతున్న రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల నిమిత్తం పెదకాల్వ సెంటర్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే వాహనాలకు దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. మచిలీపట్నం వైపు వెళ్లే వాహనదారులు పెదకాల్వ సెంటర్ మీదుగా పామర్రు రోడ్డులోని బిళ్లపాడు మీదుగా చిన ఎరుకపాడు కొత్త బైపాస్ రోడ్డు నుంచి బొమ్ములూరు, గుడ్లవల్లేరు మీదుగా మచిలీపట్నం వెళ్లాలని కోరారు. అదేవిధంగా మచిలీపట్నం నుంచి వచ్చే వాహనదారులు బొమ్ములూరు కొత్త బైపాస్ మీదుగా చిన ఎరుకపాడు, బిళ్లపాడు మీదుగా పెదకాల్వ సెంటర్‌కు చేరుకుని కేటీఆర్ కళాశాల రోడ్డు నుంచి గుడివాడ రావాలన్నారు. ఈ విషయాలను వాహనదారులు గమనించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

ఇంజినీరింగ్ విద్యతో ఉపాధి అవకాశాలు

గుడివాడరూరల్: ఇంజినీరింగ్ విద్య ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల ఉపాధి అధికారి క్రాంతికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఎన్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్య అనంతరం ఉద్యోగ అవకాశాలు అనే అంశం నిర్వహించిన అవగాహన సదస్సులో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవడానికి స్థిరమైన టెక్నాలజీ డెవలప్‌మెంట్ కోడింగ్ తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. కోడింగ్‌లో నైపుణ్యం సాధిస్తే వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కేఏస్ అప్పారావు, ప్రిన్సిపాల్ ఎల్ ఆర్‌కే ప్రసాద్, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు పాల్గొన్నారు.

యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలి



మాట్లాడుతున్న ఏడీఏ శ్యామల

మొవ్వ: మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని ఎరువుల దుకాణాల యజయమానులు, డీలర్లు యూరియాను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని మొవ్వ ఏడీఏ సూరపనేని శ్యామల పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆ మూడు మండలాలకు సంబంధించిన డీలర్లు, సొసైటీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎకరానికి ఒక అరకట్ట యూరియా చొప్పున గరిష్ఠంగా ఒక విడతలో నాలుగు కట్టలు కంటే అధికంగా యూరియా ఇవ్వరాదని ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నోటీస్ బోర్డులో ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు తెలియపరచాలని సూచించారు. వ్యవసాయ శాఖ నిబంధనలను అతిక్రమించితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు బి.సురేష్ బాబు నాయక్, రామ్మోహన్, కే మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించండి



మాట్లాడుతున్న సీఐ చిట్టిబాబు

పమిడిముక్కల: వినాయకచవితి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు తెలిపారు. వినాయచవితి ఉత్సవాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులు, ఉత్సవాల నిర్వాహకులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే వారు ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకొని ఉత్సవాల బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయితీ, విద్యుత్, పోలీస్‌శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ బి.శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోని విద్యుత్ మరమ్మతుల నియమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ వరకుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల సమయంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీ.వి.శ్రీనివాసరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటినెన్స్‌తో పాటు విద్యుత్ లైన్లకు సంబంధించిన మరమ్మతులతో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నెహ్రూనగర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం

ఇద్దరు మహిళలకు గాయాలు





చికిత్స పొందుతున్న రోశమ్మ, రత్నసుధ

గుడ్లవల్లేరు: స్థానిక నెహ్రూనగర్‌లో ఒక పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నెహ్రూనగర్‌కు చెందిన బి.రత్నసుధను, అలాగే బంధువుల ఇంటికి కోడూరు నుంచి వచ్చిన కె.రోశమ్మను కూడా పిచ్చికుక్క కరిచింది. రెండు గేదలు, ఒక దూడ, ఒక ఆవు కూడా ఈ పిచ్చికుక్క కాటుకు గురయ్యాయి. ఆ కుక్క కోసం స్థానిక యువకులు గాలిస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావుకు వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు జి.రవి పరిస్థితిని వివరించారు. బాధితులు రత్నసుధ, రోశమ్మ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

టీబీ రహిత భారత్‌ను సాకారం చేయాలి

కైకలూరు/కలిదిండి: టీబీ రహిత భారత్‌ను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కై కలూరు టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ బి.వినయ్‌కుమార్ కోరారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కలిదిండిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో 'టీబీ నివారణ అవగాహన కార్యక్రమం' శుక్రవారం నిర్వహించారు. కైకలూరులో డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అధ్యక్షతన విద్యార్థులకు టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ త్రినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు టీబీ నివారణ అవగాహన కల్పించారు.

ఇళ్ల తనిఖీ

మండవల్లి: భైరవపట్నంలోని పిట్టల వాళ్ల ఇళ్లను సీఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు సిబ్బందితో శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పేలుడు పదార్థాలు ఉండడం ఉండటం నేరమన్నారు. ఈ ఏడాది జనవరిలో ఇదే ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి చెందిన సంఘటన తెలిసిందేనన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు.

25 నుంచి రైల్వే గేట్ మూసివేత

మండవల్లి: మండవల్లి నుంచి గన్నవరం వెళ్లే దారిలోని రైల్వే గేటును మూసివేయనున్నారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు మరమ్మతుల నిమిత్తం మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు.

29 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: పోరంకి గ్రామంలో అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఉషారాణి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పోరంకి ప్రభూనగర్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం అందటంతో గురువారం రాత్రి తనిఖీలు చేశామన్నారు. అయితే కేసరపల్లి గ్రామానికి చెందిన పసుమర్తి సత్యనారాయణ, దుంగ రామకృష్ణ, ఆటో డ్రైవర్ ఎలుకెపల్లి సాయిబాబుతో కలిసి 29 బియ్యం బస్తాలు (1025 కేజీలు) ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఆటోను సీజ్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



ముదినేపల్లిలో వరలక్ష్మీ దేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సామూహిక వరలక్ష్మీవ్రతాల్లో పాల్గొన్న భక్తులు



పెద్దింట్లమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో పాటు మధ్యాహ్నం నుంచి అమావాస్య ఘడియలు సమీపిస్తుండడంతో ఉదయాన్నే వ్రతాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ నిత్యాన్నదాన షెడ్డులో వ్రతాలు నిర్వహించారు. ప్రముఖ యాజ్ఞికుడు ఆసూరీ రంగనాథాచార్యులు ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం సామూహిక వరలక్ష్మీవ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీ కొండలమ్మకు శ్రావణ పూజలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను కనులపండువగా వేద పండితులు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలను వేద మంత్రోచ్ఛరణ నడుమ చేపట్టారు. అనంతరం సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముగిసిన శ్రావణ మాసోత్సవాలు

గుడివాడరూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక లీలామహల్‌రోడ్డులోని శ్రీవిజయ దుర్గ అమ్మవారి ఆలయంలో చివరి శుక్రవారం పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు పలు రకాలకు చెందిన చీరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో నెలరోజుల పాటు శ్రావణ మాస వేడుకలు ఘనంగా జరిగాయని వేదపండితుడు పునీత్‌శర్మ తెలిపారు. లోక కళ్యాణార్థం ప్రతిరోజూ తెల్లవారుజామున అమ్మవారికి శ్రీలక్ష్మి సహస్రనామార్చన నిర్వహించామన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ తెల్లవారు జాము నుంచే మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చేవారన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో..

కైకలూరు: శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ఉప ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ మహిళా భక్తులతో ఈ వ్రతాన్ని చేయించారు. పెద్దింట్లమ్మ చెంత కొలువైన పార్వతీ సమేత జలదుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని అవినేటి మండపంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.



గుడివాడలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



తెల్లవారుజామునే అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరిన భక్తులు



కొండలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

మొవ్వ: మండలంలోని ఆలయాల, బ్యాంకులు, విద్యా సంస్థలు, వాపార సంస్థల నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించుకుపోతున్నారని పేర్కొన్నారు. అందువల్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు మండలంలోని 16 సచివాలయాల మహిళా పోలీసులు ఆయా సంస్థల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు.

రైతుకు ఆర్థిక సాయం

పమిడిముక్కల: మండలంలోని ఐనంపూడి గ్రామంలో ఇటీవల పిడుగుపడి కొల్లి శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన రెండు గేదెలు, ఒక ఎద్దు చనిపోయాయి. రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో రైతు శ్రీనివాసరావుకు రోటరీ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రమణ్యం రూ.10 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు సయ్యద్ అనీస్, వెంకటేశ్వరరావు, ప్రసాదరెడ్డి, కోటేశ్వరరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రవాణా భత్యంపై వివరాల సేకరణ

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించడానికి సంబంధించిన మార్గదర్శకాలను అధికారులు విడుదల చేయడంతో పాటు వెంటనే వివరాలు పంపాలని హెచ్ఎంలను ఆదేశించారు. దూరప్రాంత విద్యార్థులకు రవాణా సౌకర్యం నిమిత్తం లీప్ యాప్‌లో స్టూడెంట్ కన్ఫర్మేషన్ కోసం ఆప్షన్ కల్పించినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. హెచ్ఎంతమ లాగిన్‌లో విద్యార్థుల వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉంది.

ప్లాస్టిక్ వాడకం నిషేధం

కైకలూరు: రైతు బజారులో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కైకలూరు ఎస్టేట్ ఆఫీసర్ పి.నందినీదేవి చెప్పారు. రైతు బజారులో ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలంటూ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానాలు విధిస్తామన్నారు.

చిరు వ్యాపారాలపై తనిఖీలు

ముదినేపల్లి రూరల్ మండలంలోని సింగరాయపాలెంలో చిరు వ్యాపారాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.వెంకటరత్నం, ఫుడ్ సేఫ్టీ అధికారి రామరాజు, సిబ్బంది పలు వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. స్వీట్ షాపులు, బేకరీలు, బండ్లపై నిర్వహించే వ్యాపారాలు పరిశీలించారు.

మేడూరు-మధునాపురం రహదారికి మరమ్మతులు

పమిడిముక్కల: పమిడిముక్కల నుంచి మేడూరు మీదుగా మధునాపురం వెళ్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రహదారి మరమ్మతులకు మేడూరు గ్రామానికి చెందిన రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రూ.2 లక్షలు సాయం అందజేశారు. దీంతో శుక్రవారం రహదారి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇరిగేషన్ భూమిని కాపాడాలి

ముదినేపల్లి రూరల్: కబ్జా కోరల్లో ఇరుక్కున్న ఇరిగేషన్ భూమిని విడిపించడంతో పాటు తమ భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు. స్థానిక పోల్‌రాజ్ కాలువ నుంచి హైస్కూల్ పక్కగా పెయ్యేరు పంటపొలాలకు వెళ్లే బ్రాంచ్ కాలువ ఉంది. ఒక బడాబాబు పంట కాలువను అడ్డగోలుగా పూడ్చివేసి సిమెంట్ సామగ్రి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల సుమారు 400 ఎకరాలకు సాగునీటిని అందించే కాలువ పూడుకుపోయి ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు.

క్లుప్తంగా

పశు పోషకుల అభ్యున్నతే లక్ష్యం



గుడివాడరూరల్: పశు పోషకుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మోటూరు పీఏసీఎస్ చైర్మన్ చీకటి శేషగిరిరావు పేర్కొన్నారు. మండలంలో రెండో విడత పశు పోషకులకు సబ్సిడీపై అందించే దాణా ఎస్‌సీఎస్‌పీ కింద 220 బ్యాగ్‌లు 50 కేజీలవి మోటూరులోని పశు వైద్యశాలకు శుక్రవారం వచ్చాయి. ఈ సందర్భంగా పశు పోషకులకు దాణాను సబ్సిడీపై చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాణా బ్యాగులను ఎస్సీ పశుపోషకులకు సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తారని తెలిపారు. ఒక్కో బ్యాగ్ రూ.1,110 కాగా 50 శాతం సబ్సిడీపై రూ.555కు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యశాఖ అధికారి వి.హనుంతరావు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై వెలిగిన వీధిలైట్లు



పమిడిముక్కల: నేషనల్ హైవేపై ఉయ్యూరు నుంచి తాడంకి వరకు ఏడాదిగా వీధిలైట్లు వెలగడం లేదని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ బాలాజీ వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ సమస్యపై 'సాక్షి'లో నిర్వహణ అస్తవ్యస్తం..వెలగని వీధిలైట్లు కథనం ప్రచురితమైంది. దీనిపై శ్రీనివాసగౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి నేషనల్ హైవేపై వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

ఆటో వర్కర్లకు ఇబ్బందులు



గుడ్లవల్లేరు: ఉచిత బస్సు పథకం స్త్రీ శక్తితో ఆటో వర్కర్లకు కిరాయిలు లేక ఇబ్బందులు తలెత్తాయని ఆటో వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు గోట్రు కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో వర్కర్లు అధిక సంఖ్యలో విచ్చేసి గుడ్లవల్లేరు ప్రధాన సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ బి.లోకరాజుకు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.జోషి, రాజ్‌కుమార్, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బాలమ్మతల్లి వార్షికోత్సవ పూజలు



జమిదింటకుర్రు(పెదపారుపూడి): మండలంలోని జమిదింటకుర్రు గ్రామంలోని శ్రీ బాలమతల్లి వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమారరాజా బాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక భద్రత కల్పించాలి



గుడ్లవల్లేరు: దివ్యాంగులకు ఆర్థిక భద్రత కల్పించాలని మండలంలోని మామిడికోళ్లకు చెందిన వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ స్టేట్ కన్వీనర్ బందెల కిరణ్‌రాజ్ కోరారు. శుక్రవారం దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల స్త్రీ శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డిని కలిసి రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన పెన్షన్ల తొలగింపుపై వినతిపత్రాన్ని కిరణ్‌రాజ్ అందించారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియ పర్సంటేజ్‌ల తగ్గింపు తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పింఛన్ తొలగింపు ప్రక్రియపై పునరాలోచన చేసి ప్రతి నెలా యథావిధిగా ఒకటో తేదీ రోజు అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.